ఇక నిశ్చింతగా.. ఆరోగ్య భద్రత

- జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం
- నేటి నుంచి వలంటీర్ల ఇంటింటి సర్వే
- ప్రతి ఒక్కరి మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్
- వ్యాధిని బట్టి వైద్య శిబిరంలో లేదా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా మెరుగైన వైద్యం


పంపిణీకి సిద్ధమైన జగనన్న ఆరోగ్య సురక్ష వివరాలు తెలిపే బ్రోచర్

వచ్చేసింది జగనన్న ఆరోగ్య సురక్ష పథకం.. పేదలు తమ ఆరోగ్యంపై ఇక బెంగపడనవసరం లేదు. ఆసుపత్రికి వెళ్లాలన్నా.. మందులు కొనాలన్నా ఆర్థికంగా ఇబ్బంది పడే పేదలు, బడుగు–బలహీన వర్గాల వారు ఇక నిశ్చింతగా ఉండొచ్చు. యాప్ డౌన్‌లోడ్ చేసుకుని.. ఎవరికి ఏ రుగ్మత వచ్చినా ఆ వివరాలు నమోదు చేస్తే వెంటనే ఏఎన్ఎం వచ్చి తక్షణ వైద్యసాయం చేస్తారు. ఉపశమనం లభించకపోతే వైద్యాధికారి ఇంటి ముంగిటకే వస్తారు. ప్రజల వద్దకు పాలన నినాదంతో ముందుకెళ్తున్న సీఎం జగన్ ప్రభుత్వం ఇప్పుడు సంపూర్ణ వైద్య సేవలను ప్రజల ముంగిటే అందించే ప్రక్రియకు నాంది పలికింది.

జగదాంబ : నిన్న మొన్నటి వరకు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండానే జగనన్న సురక్షతో ఇంటింటి సర్వే చేసి అందరికీ ఇంటి వద్దకే కుల, నివాస, ఆదాయ వంటి అవసరమైన అన్ని రకాల ధ్రువపత్రాలు అందజేసింది సీఎం జగనన్న ప్రభుత్వం. నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం పరితపించే ముఖ్యమంత్రి ఇప్పుడు తన ప్రజల బాగు కోసం మరో వరం ప్రసాదించారు.. అదే 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకం. ఏఎన్ఎంలు డౌన్‌లోడ్ చేసిన యాప్‌లతో ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని తద్వారా సంబంధిత వైద్యుని చేత చికిత్స చేయించటం, ఆరోగ్యం క్షీణిస్తే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం చేయించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం.

పథకం వివరాలు ఇవీ..

జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో ముందుగా వార్డు వలంటీర్లు ఇంటింటి సర్వే చేస్తారు. తర్వాత ఆయా సచివాలయాల ఏఎన్ఎంలకు వివరాలు అందజేస్తారు. ఆ వివరాల ద్వారా ఏఎన్ఎంలు ఆయా ఇళ్లకు వెళ్లి వారి వద్ద ఉన్న జగనన్న ఆరోగ్య సురక్ష యాప్‌ను ఆ కుటుంబంలో ఒకరి సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేస్తారు. దీంతో పాటు ఆ కుటుంబంలో ఎవరికి ఆరోగ్యం బాగులేదో ఆ వివరాలు పొందుపరుస్తారు. తర్వాత ఆ ప్రాంతంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో ఉన్న వైద్యులు శిబిరంలో పాల్గొని సేవలందిస్తారు. ఆ శిబిరానికి సర్వే ద్వారా ఆరోగ్యం బాగులేదని నమోదైన వారంతా వచ్చిందీ లేనిదీ పరిశీలిస్తారు. రాకపోతే వైద్య సిబ్బందే దగ్గరుండి రోగులను వైద్య శిబిరాలకు తరలిస్తారు. రోగులను ఆరోగ్య కేంద్రంలో వ్యాధిని బట్టి ప్రతేక వైద్య నిపుణులు పరీక్షిస్తారు. అప్పటికీ వ్యాధిగ్రస్తులకు మరింత మెరుగైన వైద్యం అవసరం అనుకుంటే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం నెట్ వర్క్ ద్వారా వైద్యం అందిస్తారు.

యాప్ ఉంటే ఆరోగ్యానికి భరోసా దొరికినట్లే..

జగనన్న ఆరోగ్య సురక్ష యాప్ ఉంటే ఆరోగ్యానికి భరోసా దొరికినట్లే. అర్ధరాత్రి అపరాత్రి అనే భయం లేకుండా కుటుంబంలో ఎవరికి ఆరోగ్యం బాగులేకపోయినా ఆ వివరాలు పొందుపరిస్తే వెంటనే దగ్గరలోని ఏఎన్ఎం వచ్చి చికిత్స అందిస్తారు. ఇది రోగులకు ప్రథమ చికిత్సగా ఉపయోగపడుతుంది. దీని వలన అత్యవసరంగా ఆసుపత్రులకు పరిగెత్తాల్సిన అవసరం ఉండదు. కేవలం యాప్ ఉండడంతో ముందుగా ఏఎన్ఎం, తర్వాత రోగి పరిస్థితిని బట్టి వైద్యాధికారి కూడా రోగి చెంతకు వస్తారు.

ఆరోగ్యశ్రీ వివరాలు తెలిపే కరపత్రాల పంపిణీ

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మరో మేలు జరుగుతుంది. ఇప్పటి వరకు ఏ వ్యాధులు ఆరోగ్యశ్రీ పథకంలోకి వస్తాయి? వాటిని పొందే విధానం ఏమిటి? ఆ సేవలు పొందాలంటే ఏ పేపర్లు తీసుకెళ్లాలి? అత్యవసరంగా వైద్య సాయం పొందే విధానం ఏమిటి? అనే అంశాలు క్షుణ్ణంగా తెలిసేలా కరపత్రాలు ముద్రించి ప్రతి ఇంటికి పంపిణీ చేస్తున్నారు.

రోగి విశ్రాంతి సమయంలో ఆర్థిక భరోసా..

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకంలో 1519 రకాల చికిత్సలు లభిస్తున్నాయి. ఇందులో చికిత్స పొందిన తర్వాత రోగి విశ్రాంతి తీసుకునే సమయంలో జీవనోపాధి కోల్పోయే పరిస్థితి కలగకుండా రోజుకు రూ. 225 చొప్పున నెలకు రూ. 5 వేల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుంది.

ఏ కేటగిరీలో ఏ వైద్యం పొందొచ్చో ఇలా తెలుసుకోవచ్చు..

- 104 కాల్ సెంటర్ ద్వారా పొందే చికిత్స
- విలేజీ హెల్త్ క్లినిక్ ద్వారా
- 108 అంబులెన్స్ ద్వారా
- ఫ్యామిలీ డాక్టర్ ద్వారా
- ప్రాథమిక వైద్య కేంద్రం ద్వారా (పీహెచ్‌సీ)
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్ ద్వారా
- మీకు ఆసుపత్రిలో ఉచితంగా అందించే సేవలు
- ఆరోగ్యశ్రీ పథకానికి ఏ పత్రాలు తీసుకెళ్లాలి? ఎవరిని కలవాలి? అక్కడ ఏ సేవలు ఉచితంగా అందిస్తారు?
- చివరగా ఆరోగ్యశ్రీ సేవలు సంతృప్తికరంగా లేని యెడల ఫిర్యాదు చేసే విధానం వంటి అన్ని అంశాలతో కరపత్రాలను వలంటీర్లు ప్రతి ఇంటికీ అందజేస్తారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఇంటికీ రక్ష


సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన ప్రతి ఇంటికి ఆరోగ్య రక్ష కార్యక్రమం బృహత్తరమైనదని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలో ప్రతి వ్యక్తిని ఆరోగ్యంగా ఉంచే మంచి కార్యక్రమమే జగనన్న ఆరోగ్య సురక్ష అని, ఈ కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. అందుకు సంబంధించి గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా 5 దశల్లో ఉచితంగా 7 రకాల పరీక్షలు జరుగుతాయని, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలపై కూడా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న మెడికల్ క్యాంపుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, దశమంతుల మాణిక్యాలరావు, అలపన కనకరెడ్డి, జేసీఎస్ ప్రెసిడెంట్లు బాపూ ఆనంద్, కర్రి నీలకంఠం, పీతల వాసు, ఇన్‌చార్జిలు దొడ్డి రామానంద్, కోన శంకర్, సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందీ భాషను అందరూ నేర్చుకోవాలి


పాల్గొన్న మహిళా కళాశాల విద్యార్థినులు


మాట్లాడుతున్న ఏవీఎన్ కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు

అల్లిపురం : జాతీయ భాష హిందీని విద్యార్థులందరూ నేర్చుకోవాలని మహాత్మాగాంధీ మున్సిపల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీవీఎస్ నాగభూషణం అన్నారు. హిందీ దివస్ కార్యక్రమాన్ని గురువారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ నేర్చుకునే క్రమంలో ప్రాథమిక, మాధ్యమిక, విశారద వంటి కోర్సులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం హిందీ భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల హిందీ ఉపాధ్యాయులు కె. అప్పారావు, పి.సుధా రమేష్‌బాబులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, పాఠశాల ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది సత్కరించారు.

ఏవీఎన్ కళాశాలలో..

దాబాగార్డెన్స్ : నగరంలోని ఏవీఎన్ కళాశాలలో గురువారం ఆ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో హిందీ దివస్ ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు పాల్గొని మాట్లాడారు. జాతీయ భాష హిందీని అందరూ నేర్చుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, డీన్ శంకర్ నారాయణ్ హిందీ ఆవశ్యకత వివరించారు. కళాశాల హిందీ విభాగధిపతి జేవీఎస్ఎల్ శ్రీనివాస్ కుమార్, హిందీ అధ్యాపకురాలు భానుమతి, ఆంగ్ల విభాగాధిపతి పైడి రజని, అధ్యాపకులు యేసయ్య, వెంకటరత్నం, వినీత, అనంతలక్ష్మి, ఆనంద్ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో..

గురువారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, గురజాడ అప్పారావు డిగ్రీ కళాశాల (యలమంచిలి) సంయుక్తంగా హిందీ భాషా దినోత్సవం నిర్వహించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. చంద్రశేఖర్, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ కె. సుధ, ప్రముఖ భాషావేత్త మహ్మద్ దానిష్, మహిళా కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ అరుణపద్మ, రాధమ్మ, ఏవీ సత్యనారాయణ, ప్రేమ్‌సాగర్, మెంటార్ వీఎస్ రాజు, మార్టిన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆపదలో ఉన్నవారికి అండగా సీఎం జగన్


లబ్ధిదారుకు కొత్త పింఛన్ అందజేస్తున్న విజయలక్ష్మి

అల్లిపురం : ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తారని నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ బోర విజయలక్ష్మి అన్నారు. ఈ నెల కొత్త వైఎస్సార్ పింఛన్ల పంపిణీలో భాగంగా జీవీఎంసీ 33వ వార్డు పరిధి వేంకటేశ్వరమెట్ట–2 పరిధిలో వితంతు పింఛన్‌ను లబ్ధిదారు వెంకటలక్ష్మికి గురువారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి ఒక కొడుకుగా, అన్నగా, తోబుట్టువుగా చేయూత అందజేస్తున్నారన్నారు. నవరత్న పథకాలను నూటికి నూరుశాతం అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు వలంటీర్లు పుష్పరాణి, పద్మ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాల పంపిణీ


ఖాకీ చొక్కాలు ధరించిన ఆటో డ్రైవర్లతో ఎస్‌కే సలీమ్

అల్లిపురం : దక్షిణ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ నాయకులు సీతంరాజు సుధాకర్ సహకారంతో ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాల పంపిణీ జరిగింది. 32వ వార్డు నాయకుడు ఎస్‌కే సలీమ్ ఆధ్వర్యంలో వార్డులో నేరెళ్లకోనేరు ప్రాంతంలో గల సాయి గణేష్ దుర్గ ఆటోస్టాండ్‌లో గురువారం ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు వార్డు సీనియర్ నాయకులు రమేష్, నీలబాబు, వెల్డింగ్ శ్రీను, ఎల్లాజీ, అరుణ్, అప్పారావు, సాజన్, సీహెచ్ కొండ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలుష్యంతో క్షీణిస్తున్న ప్రజల ఆరోగ్యం


మాట్లాడుతున్న బొలిశెట్టి సత్యనారాయణ

సీతమ్మధార : రాష్ట్రంలో కాలుష్యం వల్ల ప్రజల ఆరోగ్యం క్షీణిస్తుందని జనసేన పార్టీ పర్యావరణ విభాగం ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు. మత్స్యకారుల జీవితాలు–ప్రభుత్వ నిర్లక్ష్యం–నివారణ చర్యలు అనే అంశంపై గురువారం ఆశీలమెట్టలోని ఒక హోటల్లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలుష్యం కేవలం మత్స్యకారుల సమస్య మాత్రమే కాదని, రాష్ట్ర సమస్య అన్నారు. మత్స్యకారుల సంరక్షణకు ప్రత్యేక చట్టం అవసరమన్నారు. మత్స్యకార వికాస విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముగి శ్రీనివాస్, జనసేన నాయకుడు సుంకు వెంకటేశ్వరరావు, సతీష్ పాల్గొన్నారు.

'ప్రత్యేక ఉత్తరాంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలి'

దాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర జిల్లాల వెనుకబాటుకు గల కారణాలు, విశ్లేషణ, అన్ని రంగాల అభివృద్ధికి ఒక అధ్యయన కమిటీ ఏర్పాటు చేయాలని, లేదంటే ఉత్తరాంధ్ర ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజుగౌడ్ డిమాండ్ చేశారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్యా రంగంలో వెనుకబడే ఉన్నామని అన్నారు.

ఆత్మహత్యల నివారణపై విద్యార్థినులకు అవగాహన


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

దాబాగార్డెన్స్ : జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ రమేష్ కిషోర్ సూచనల మేరకు జిల్లా మానసిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గురువారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ వారోత్సవాల అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ జి. సాయిలక్ష్మి, సోషల్ వర్కర్ ఎ. మధులత పాల్గొని ఆత్మహత్యల నివారణ మార్గాలు, సూచనలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌ను విడనాడి.. చదువుపై దృష్టి పెట్టండి

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీలోని అనాటమీ బ్లాక్‌లో యాంటీ ర్యాగింగ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ గురువారం జరిగింది. వైద్య విద్యలో కొత్తగా చేరిన విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ, ఏఎంసీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ మాట్లాడుతూ ర్యాగింగ్ నిరోధక చట్టం గురించి విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండి విద్యను అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి కె.వాణిశ్రీ, డీఎల్ఎస్ఏ ప్యానెల్ న్యాయవాది కె.అప్పలనాయుడు, ఏఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్మథరావు, సైకియాట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.మాధవీలత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పీఎస్ఎన్ రాజు, అంబేడ్కర్ లా కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌వీకే ప్రసాద్, ఏఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బంగారయ్య, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

1,2 తేదీల్లో మిరాకిల్ మెగా టాలెంట్ హంట్

దాబాగార్డెన్స్ : చిన్నారుల్లో దాగిన సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీసేందుకు గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 1, 2 తేదీల్లో మిరాకిల్ మెగా టాలెంట్ హంట్ నిర్వహించనున్నట్లు మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎంవీవీ సత్యనారాయణ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఆ రెండు రోజులు ఉదయం 9.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీ వేదికగా పోటీలుంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9966485335 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

జోన్–4 టీపీఎస్‌గా రూన్సీ


టీపీఎస్ రూన్సీ

జగదాంబ : జీవీఎంసీ జోన్–4 టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్)గా రూన్సీ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఈ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ (ఏసీపీ ఇన్‌చార్జి) ఒక్కరే ఉండడంతో కమిషనర్ ఈమెను జీవీఎంసీ జోన్–1 నుంచి జోన్–4కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా రూన్సీ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వర్తిస్తానన్నారు.

వినాయక ప్రతిమల పంపిణీ


మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తున్న అదనపు కమిషనర్ డాక్టర్ సన్యాసిరావు

దాబాగార్డెన్స్ : పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్వాతి ప్రమోటర్స్ ఆధ్వర్యంలో గురువారం జీవీఎంసీ ఉద్యోగులకు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ బి. సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ చేతుల మీదుగా విగ్రహాలు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే పలు స్వచ్ఛంద సంస్థలు పర్యావరణహితంగా వినాయక చవితి చేసుకునేందుకు వారి వంతు కృషి చేస్తున్నారని తెలిపారు. దీనిలో భాగంగా స్వాతి ప్రమోటర్స్ చీఫ్ మార్కెటింగ్ మేనేజర్ ఎంఆర్ మూర్తి ఆధ్వర్యంలో జీవీఎంసీ ఉద్యోగులకు 2 వేల మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారని తెలిపారు. నగరంలో దాదాపు 20 వేల మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేయనున్నారని తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం

సీతమ్మధార: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గద్దె దించడమే తమ లక్ష్యమని పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. ఆశీలమెట్టలోని ఒక హోటల్లో గురువారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు జనసేన, టీడీపీ కలవాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా తమ అధినేత ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ వ్యవస్థను బాగు చేయడానికి పవన్ కల్యాణ్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. చోడవరం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, కార్పొరేటర్ మూర్తి యాదవ్ పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి


దుర్గమాంబ సమాజం వద్ద దుర్వాసన వెదజల్లుతున్న మురుగు


గాజులవీధి వద్ద ఎత్తని చెత్త

- అధికారులకు 35వ వార్డు ప్రజల విన్నపం

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డులో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయి అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు కూడా పరిశుభ్రంగా లేక దోమల బారిన పడుతున్నామంటున్నారు. కల్లుపాకలు ప్రాంతంలో మురుగు కాలువలు పరిశుభ్రం చేసి రోజులు కావస్తున్నాయని తెలిపారు. సుమారు ఏడు వేల జనాభా ఉండే ఈ ప్రాంతంలో కాలువలు పరిశుభ్రం చేయకపోవటంతో మురుగు నీరు ఇంటి ముంగిటే నిలిచిపోయి దోమలు ముసురుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రసాద్‌గార్డెన్స్ దరి దుర్గమాంబ సమాజం వద్ద కూడా మురుగు రోడ్డుపైనే నిలిచిపోవటంతో దుర్వాసన భరించలేకపోతున్నామని వాపోతున్నారు.

కాన రాని ఫ్రైడే డ్రైడే : జీవీఎంసీ ఉన్నతాధికారులు దోమలు వ్యాప్తి చెందకుండా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేస్తున్నా కల్లుపాకలు, గాజులవీధి ప్రాంతాల్లో కనీసం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు పర్యటించినప్పుడు పరిశుభ్రంగా ఉండే ప్రాంతాల్లోని ఇళ్లను ఎంపిక చేసుకుని కార్యక్రమాలు నిర్వహించటం వల్ల అంతా బాగుందని అధికారులు వెళ్లిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. కల్లుపాకలు, లక్ష్మీనగర్, వెలంపేట, గాజులవీధి, ప్రసాద్‌గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో అధికారులు పర్యటిస్తే అవన్నీ ఎంత శుభ్రంగా ఉన్నాయో తెలుస్తుందంటున్నారు. బ్లీచింగ్, యాంటీ లార్వా కార్యక్రమాలు, ఫినాయిల్ చల్లటం వంటి ఏ ఒక్క కార్యక్రమం తమ వీధుల్లో జరగడంలేదని ఆయా ప్రాంతాల స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించాలని 35వ వార్డు ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా సహస్ర తులసి పూజ

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలోను అధిక సంఖ్యలో ఉభయదాతలు పాల్గొన్నారు.

శ్రావణమాసం ప్రత్యేక కుంకుమ పూజలు..

కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న శ్రావణలక్ష్మీ పూజలు గురువారం 29వ రోజుకి చేరాయి. పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశానికి డిమాండ్

అల్లిపురం : పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశ పెట్టాలని ఏపీ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్, జాతీయ బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 22వ తేదీన న్యూఢిల్లీలో జరగనున్న సమావేశానికి తరలి రావాలని ఛలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ న్యూఢిల్లీలో జరిగే సమావేశాలకు ఆంధ్రప్రదేశ్ నుంచి బీసీ నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రతి బీసీ సంఘం నుంచి మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి కొయ్య రామకృష్ణ, బీసీ నాయకులు పిల్ల నూకరాజు, రాజేష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 10 భోజనం పంపిణీ


రూ. 10 భోజనం పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మహారాణిపేట : ప్రముఖ సంఘ సేవకులు ముజీబ్‌ఖాన్ సహకారంతో శ్రీ స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు రూ. 10 భోజనాలు అందించారు. అన్నం, రసం, వెజ్ కర్రీ, చికెన్‌తో భోజనం పంపిణీ చేశారు. వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, ముజీబ్‌ఖాన్, సంస్థ సభ్యులు సత్తిబాబు, కనకమహాలక్ష్మి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. భోజనాలు వృథా కాకూడదని, సద్వినియోగం కావాలని అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పది రూపాయలకు భోజనం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


అదృశ్యమైన కిరణ్

అల్లిపురం : ఎవరో డబ్బులు ఇవ్వాలని, వాటిని తీసుకువచ్చేందుకు వెళ్లిన తన భర్త తిరిగి ఇంటికి రాలేదని కేజీహెచ్ సమీపంలో నివసిస్తున్న చందనాల అరుణ మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటన్నర ప్రాంతంలో మధురవాడలో ఎవరో బాకీ ఉన్నందున డబ్బులు తీసుకువచ్చేందుకు వెళ్లిన కోడూరు కిరణ్ తిరిగి ఇంటికి రాలేదని పేర్కొన్నారు. దీంతో నగరంతో పాటు, మధురవాడ పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో ఆమె మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అతని ఆచూకీ తెలిసిన వారు 0891–2746866, 9440796010 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

సీతమ్మధార: దాబాగార్డెన్స్‌లోని ఓ రెస్టారెంట్‌లో పని చేస్తున్న వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా.. ఒడిశా నుంచి వలస వచ్చి అక్కయ్యపాలెం లలితా నగర్‌లో ఉంటున్న అలోక్ మండల్ బుధవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. అతడి తమ్ముడు అజయ్ మండల్ తలుపులు పగులగొట్టి చూడగా.. అప్పటికే అలోక్ మండల్ మృతి చెందాడు. ఈ ఘటనపై నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. హెడ్‌కానిస్టేబుల్ కె.ఈశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

